సాక్షి కర్నూలు

సోమవారం, 17, ఏప్రిల్, 2023



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళ తాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



.. అంతులేని వ్యథ

హిమోఫిలియా వారసత్వంగా వచ్చే జన్యుపరమైన వ్యాధి. రక్తప్రసరణ వ్యవస్థకు చెందిన ఈ జబ్బు ఎక్కువగా మగపిల్లలకు మాత్రమే సంక్రమించే అవకాశం ఉంది. 8లో▸



మహానందిలో సండే సందడి

మహానంది: మహానంది క్షేత్రం ఆదివారం భక్తులతో కళకళలాడింది. భక్తులు కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:38	ఉ॥ 4:37
ఆదోని	సా॥ 6:41	ఉ॥ 4:40
నంద్యాల	సా॥ 6:38	ఉ॥ 4:40
ఆత్మకూరు	సా॥ 6:36	ఉ॥ 4:34
బనగానపల్లె	సా॥ 6:41	ఉ॥ 4:34

హదీస్ వెలుగు :

మహమ్మద్ ప్రవక్త రసూలుల్లా పేరు పలికినా లేదా వినగానే 'సాల్లెల్లాహు అలైహి వసొల్లం' చదవాలని అల్లాహ్ ఆజ్ఞ. లేనిపక్షంలో వినాశనం అయ్యేంత శాపం ఉంది. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

మండుతున్న ఎండలు



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వడగాలుల తీవ్రత పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కర్నూలు జిల్లాలో 43.38, నంద్యాల జిల్లాలో 43.17 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం 5 గంటల సమయంలో కర్నూలు జిల్లాలో గరిష్టంగా 41.59, నంద్యాల జిల్లాలో 41.93 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. ఎండలు, వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో రహదారులపై రాకపోకలు తగ్గిపోయాయి.

విస్తృతంగా మొక్కల పెంపకం



మొక్క నాటుతున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటి మరింత ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తామని ఈఓ లవన్న పేర్కొన్నారు. ఆదివారం ఔటర్ రింగ్‌రోడ్డు ఇరువైపులా, ఆరుబయలు ప్రదేశాల్లో, ఉద్యాన వనాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైల క్షేత్ర పరిధిలో సుమారు 1500 మొక్కలకు పైగా నాటాలని నిర్ణయించి కదంబం, వేప, మర్రి, రావి, జువ్వి, కానుగ, ఆకాశ మల్లి, పెద్దఆరె, నేరేడు మొదలైన మొక్కలను నాటుతున్నామన్నారు. నాటిన చెట్ల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉద్యాన వన అధికారులను ఆదేశించామన్నారు. అనువైన చోట్ల మరిన్ని బిల్వం, కదంబం, ఉసిరి, మేడి, తదితర మొక్కలను నాటి ఆధ్యాత్మికతను పెంపొందిస్తామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రామకృష్ణ, ఉద్యాన వన విభాగపు విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, ఉద్యాన వన అధికారి లోకేష్, అర్చకస్వాములు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. వసంతోత్సవం



వసంతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి వార్షిక వసంతోత్సవ వేడుకలు ఆదివారం నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. దిగువ అహోబిలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాద వరదస్వాములను కొలువుంచి నవకళశ స్థాపన, పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వసంతోత్సవ సేవ నిర్వహించారు. వసంత రుతువులో శ్రీ అహోబిలేశుడు వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించేందుకు జరిగే ఈ వేడుకను వసంతోత్సవంగా పిలుస్తారు.



ఈ చిత్రంలో కనిపించే మహిళ పేరు మహేశ్వరి. గూడూరు పట్టణానికి చెందిన మహిళ. గతంలో గృహిణిగా ఉండేవారు. ఏడాదిన్నర క్రితం ప్రభుత్వ సహకారంతో ఫిష్ ఆంధ్ర కింద రిటైల్ వెండింగ్ యూనిట్ పొందారు. 60 శాతం సబ్సిడీ లభించింది. అన్ని రకాల చేపలు, రొయ్యలు, పీతలు తెప్పించి విక్రయిస్తున్నారు. వారానికి 500 కిలోలకుపైగా చేపలను వినియోగదారులకు విక్రయిస్తునానరు. అన్ని ఖర్చులు పోగా నెలకు రూ.35 వేల వరకు ఆదాయం వస్తోందని మహేశ్వరి తెలిపారు.



ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్‌లో విక్రయానికి ఉంచిన చేపలు



ఈ చిత్రంలో కనిపించే మహిళ పేరు భారతి. కర్నూలు సోనియా గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈమెకు మత్స్యశాఖ కొద్ది నెలల క్రితం మొబైల్ ఫిష్ వెండింగ్ యూనిట్‌ను మంజూరు చేసింది. ఈమె, ఈమె భర్త ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగరంలోని వివిధ కూడళ్లలో చేపలు విక్రయిస్తారు. సాయంత్రం నుంచి వెంకటరమణ కాలనీలో రోడ్డు నంబరు–2లో చేప రోస్ట్, ఫ్రై తయారు చేసి విక్రయిస్తారు. వారానికి చేపలు 400 నుంచి 500 కిలోల వరకు, చేపల ఫ్రై, రోస్ట్ 100 నుంచి 120 కిలోల వరకు విక్రయిస్తారు. అన్ని ఖర్చులు పోను రోజుకు రూ.1,000 నుంచి రూ. 1,200 వరకు ఆదాయం వస్తోందని భారతి తెలిపారు.

మీనం మిలమిల

- జిల్లాలో గణనీయంగా పెరిగిన చేపల వినియోగం
- పట్టణాల్లో ఫిష్ ఆంధ్ర రిటైల్ వెండింగ్ యూనిట్ల ఏర్పాటు
- అందుబాటులోకి వచ్చిన మొబైల్ ఫిష్ వెండింగ్ వాహనాలు



రిటైల్ అవుట్‌కు తెప్పించిన పీతలు

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్యకారుల సంక్షేమానికి, వినియోగదారుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్ర నినాదంతో మంచినీటి చేపలు, ఉప్పు నీటి చేపలు (సముద్రపు చేపలు) వినియోగదారుల ముంగిటకే తెస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతోంది.

44 రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటు

జిల్లాలో 52 చెరువులు, నాలుగు రిజర్వాయర్లలో చేపల పెంపకం జరుగుతోంది. మత్స్యకారుల సంక్షేమం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై)ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాయి. మత్స్యశాఖ పథకాలకు జిల్లా సహకార కేంద్రబ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తోంది. జిల్లాలో ఇప్పటికే 44 రిటైల్ ఫిష్ అవుట్‌లెట్స్ ఏర్పాటయ్యాయి. అలాగే రెండు మొబైల్ ఫిష్ వెండింగ్ యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవి మంగళ, బుధ వారాల్లో వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో జిల్లాలో చేపల వినియోగం గణనీయంగా పెరిగింది. అదే సమయంలో మత్స్యకారుల సంక్షేమానికి బాటలు వేసినట్లు అయింది. కర్నూలు నగరంలో 11, గూడూరు, సీ.బెళగల్, కల్లూరు, ఆదోని, గోనెగండ్ల, ఆస్పరి, మంత్రాలయం తదితర ప్రాంతాల్లో ఫిష్ ఆంధ్ర రిటైల్ యూనిట్లు ఏర్పాటయ్యాయి.

పెరిగిన వినియోగం

జిల్లాలో చేపల వినియోగం గణనీయంగా పెరిగింది. 2018–19కి ముందు ఉత్పత్తిలో కేవలం 10 నుంచి 15 శాతం వరకే వినియోగం ఉండేది. మార్కెట్‌లో నాణ్యమైన చేపలు కనిపించేవి కావు. ఫిష్ ఆంధ్ర కింద పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం, అన్ని రకాల చేపలు సరఫరా అవుతుండటంతో వినియోగం 40 శాతం వరకు పెరిగింది.



ఫిష్ మొబైల్ వెండింగ్ వాహనం

సబ్సిడీలు ఇవీ..

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద 40 శాతం సబ్సిడీలో రాష్ట్రం 16 శాతం, కేంద్రం 24 శాతం, 60 శాతం సబ్సిడీలో రాష్ట్రం 24 శాతం, కేంద్రం 36 శాతం భరిస్తున్నాయి. రద్దీ ప్రదేశాల్లో చేపలను విక్రయించేందుకు జిల్లాకు 15 మొబైల్ ఫిష్ వెండింగ్ యూనిట్లు కేటాయించారు. యూనిట్ ధర రూ.3 లక్షలు ఉండగా.. ఎస్సీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. చేపల రవాణాకు ఫోర్ వీలర్ వాహనాలు జిల్లాకు 8 కేటాయించారు. యూనిట్ కాస్ట్ రూ.20 లక్షలు ఉండగా.. ఎస్సీలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుంది. జిల్లాకు ఫిష్ కియోస్కులు 29 మంజూరు అయ్యాయి. ఇందులో ఒకటి కర్నూలు మండలం సుంకేసుల దగ్గర ఏర్పాటు కానుంది. యూనిట్ కాస్ట్ రూ.10 లక్షలు ఉండగా...ఎస్సీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుంది. ఫిష్ వాల్యు యాడెడ్ యూనిట్లు జిల్లాకు మూడు కేటాయించారు. యూనిట్ కాస్ట్ రూ.50 లక్షలు, ఇందులో ఎస్సీలు, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ లభిస్తోంది. మత్స్యశాఖ పథకాలకు ప్రధానమంత్రి ఫార్మలేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్ (పీఎంఎఫ్ఎంఈ) కింద అదనంగా 30 నుంచి 35 శాతం సబ్సిడీ లభించనుంది.

ఆరోగ్యానికి మంచిది



చేపలు ఆరోగ్యానికి మంచివి. డయాబెటిస్‌తో బాధపడుతున్నవారు వీటిని తినొచ్చు. మాంసం, చికెన్‌తో పోలిస్తే చేపలు సులభంగా జీర్ణం అవుతాయి. వీటిలో పిండిపదార్థాలు ఉండవు. కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, మెగ్నీషియం, కాపర్, జింక్ వంటి ఖనిజాలు, ప్రొటీన్లు ఉంటాయి. వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవడానికి చేపలు తినాల్సిన అవసరం ఉంది. – రామగిడ్డయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, కర్నూలు

చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం



చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నాం. మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు కూడా ఇస్తున్నారు. గతంలో సగటు ఒక వ్యక్తి ఏడాదికి 8 కిలోలు చేపలు మాత్రమే తీసుకునేవారు. దీనిని 30 కిలోలకు పెంచుతున్నాం. మత్స్యశాఖ పథకాలను పొందేందుకు మరిన్ని వివరాలకు 79815 33615 లేదా 85004 72766 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. – శ్యామలమ్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి, కర్నూలు

వెండి మాయం ఘటనలో సీఐ సస్పెన్షన్

- ఎస్ఐ, ఏఎస్ఐపై కూడా వేటు

కర్నూలు (టౌన్): కర్నూలు అర్బన్ తాలూకా పోలీసు స్టేషన్‌లో 105 కిలోల వెండి. రూ.2.50 లక్షల నగదు మాయం ఘటనలో సీఐ విక్రమసింహా (ప్రస్తుతం ఆదోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్)ను సస్పెండ్ చేస్తూ ఆదివారం ఎస్పీ జి. కృష్ణకాంత్ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే ఎస్ఐ లక్ష్మీనారాయణ (కర్నూలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్), ఏఎస్ఐ భాస్కర్ రాజు (కర్నూలు తాలూకా పోలీస్)లపై కూడా వేటు వేశారు. కర్నూలు అర్బన్ తాలూకా సీఐగా ఉన్న విక్రమ సింహా పోలీసు సిబ్బందితో కలసి కర్నూలు మండలం పంచలింగాల చెక్‌పోస్టు వద్ద 2021 జనవరి 27వ తేదీన పంచలింగాల చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తూ..ఎలాంటి ఆధారాలు లేని 105 కిలోల వెండి వస్తువులు, రూ.2.05 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో భద్రపరిచిన వెండిని 2022 మే 24వ తేదీ అదే స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ అమరావతి తన భర్త విజయభాస్కర్ సహకారంతో తస్కరించారు. ఈ నెల ఒకటో తేదీన నిందితులను అరెస్ట్ చేసి ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేస్తామని అప్పటి ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్ తెలిపారు. ఈనెల 12వ తేదీన నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జి. కృష్ణకాంత్ ఈ వ్యవహారంపై మరింత లోతుగా ఆరా తీశారు. అంతర్గతంగా విచారణ చేపట్టారు. పోలీస్‌స్టేషన్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించడంతో సీఐతోపాటు ఎస్ఐ, ఏఎస్ఐలను సస్పెండ్ చేశారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

■ తిమ్మగురుడి వైభవం

గూడూరు పట్టణంలో ఆదివారం సాయంత్రం తిమ్మగురుడి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకుని నైవేద్యాలు సమర్పించారు. – గూడూరు



చేనుకు రక్ష.. భూసార పరీక్ష

ఎమ్మిగనూరురూరల్: భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వేసే పంటలు, వాడే క్రిమి సంహారకాలు, ఎరువులను బట్టి మార్పు చెందుతుంది. ఆ మార్పుల్ని ఎప్పటికప్పుడు కనిపెట్టి వ్యవసాయం చేస్తేనే మంచి దిగుబడులు వస్తాయి. రైతులు అనువైన సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఈ పరీక్షలను బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో చేస్తున్నారు.

తగ్గనున్న పెట్టుబడి ఖర్చు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగు విస్తీర్ణం 9.39 లక్షల హెక్టార్లు ఉండగా..8.50 లక్షల హెక్టార్లలో రైతులు వివిధ పంటలు పండిస్తున్నారు. భూమికి ఎంత శాతం లవణాలు, మూలకాలు, ఖనిజాల అవసరమో తెలియకుండా ఎరువులు వాడుతున్నారు. ఫలితంగా పెట్టుబడి ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. ఈ నేపథ్యంలో ఎరువుల వినియోగంలో అనవసరపు ఖర్చులు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రైతు భరోసా కేంద్రాల్లో భూసార పరీక్షలు చేయించుకునే వెసలుబాటును కల్పించింది. భూమి లో ఉన్న పోషక పదార్థాలే కాకుండా, చౌడు గుణాలు, సున్నపు శాతం, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడనున్నాయి.

సేంద్రియం..ఆవశ్యకం

నల్ల చౌడు, ఆమ్లనేలను పీహెచ్ మీటర్ ద్వారా తెలుసుకోవచ్చు. పొలాల్లో రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతుండడంతో చౌడుశాతం పెరుగుతోంది. నివారణకు సేంద్రియపు ఎరువులు ఉపయోగించాలి. జీలుగతో నల్లచౌడు పోతుంది.



మట్టి నమునాల సేకరణపై శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు(ఫైల్)

ఉప్పు నేలల్లో నీరు నిల్వ చేయాలి

ఉప్పు నేలలను తెలుసుకోవడానికి కండక్టివ్ మీటర్‌ను ఉపయోగిస్తారు. పొలాల్లో తెల్లగా పేరుకు పోయి ఉంటుంది. ఎక్కడైతే 1 శాతం కన్నా ఎక్కువ ఉంటే పొలా న్ని బాగా దున్నేసి ఒక రోజు వరకు నీళ్లు నిల్వ చేయాలి. ఆ తర్వాత నీళ్లను బయటకు పంపించేయాలి.

పైరు ఎరుపు..భాస్వర లోపం

నేలలో భాస్వరం ఎంత వరకు ఉందో తెలుసుకోవడానికి కలోరి మీటర్‌ను ఉపయోగిస్తారు. ముఖ్యంగా వరి, మిరప, ఉల్లి, ఇతర కురగాయాలు పంటలకు 30 బస్తాల వరకు రసాయనిక ఎరువులు ఉపయోగిస్తే అటువంటి నేలలో ఎకరాకు 24 కిలోల కన్నా ఎక్కువ భాస్వరం ఉన్నట్లుయితే బాగుందని చెప్పవచ్చు. ఒక వేళ ఎకరాకు 150 కిలోల భాస్వరం ఎక్కవ ఉంటే మొక్కకు జింక్, ఇనుము అందకుండా చేస్తాయి. దీంతో పైరు ఎర్రగా మారుతుంది. అటువంటి సమయంలోపైపాటుగా కాంప్లెక్స్, డీఏపీ ఎరువులు వేయకూడదు. ప్రారంభంలో దుక్కిలో కొంత భాస్వరం వేసుకోవచ్చు.

పొటాష్ లోప నివారణకు..

నేలలో పోటాష్‌ను ప్లేంఫోటోమీటర్ పరికరంతో తెలుసుకోవచ్చు. పొటాష్ ఉండే ఎరువులు బయట మార్కెట్లలో దొరకడం లేదు. ప్రతి రైతు ఆరుతడి, తరి పైర్లకు ఎకరాకు 50 కిలోలలు పొటాష్‌ను వాడవచ్చు. వర్షాధారం కింద పొలాలకు ఎకరాకు 25 కిలోల పొటాష్‌ను ఉపయోగించవచ్చు.

సూక్ష్మ పోషకాల లభ్యత

నేలలో జింక్, ఇనుము, బోరాన్, మాంగనీస్, కాపర్ వంటివి తప్పనిసరిగా ఉండాలి. వీటిని తెలుసుకోవడం కోసం అటామిక్ అబ్జార్షన్ స్పెక్ట్రో ఫోటో మీటర్ పరికరాన్ని ఉపయోగిస్తారు. ఈ పరికరం ఎమ్మిగనూరు, కర్నూలు, డోన్ కేంద్రాల్లో ఉంది. జిల్లాలో 70 శాతం వరకు పొలాల్లో జింక్, ఇనుము తక్కువగా ఉన్నాయి. వీటిని అధికారులు సూచనల మేరకు పొలాల్లో ఉపయోగించాలి.

మట్టి నమూనా ఇలా సేకరించాలి..

➢ మట్టి నమూనా తీయవలసిన చోట చెత్త, చెదారం లేకుండా చూడాలి. నాగలు సాలు పోవునంతలోతు వరకు లేదంటే 6 అంగుళాల లోతు వరకు 'వి' ఆకారంలో తవ్వాలి.

➢ సేకరించిన నమునాను శుభ్రమైన సంచి లేదంటే గోనె సంచి పైనగాని పోసి కలపాలి.

➢ కలిపిన మట్టిలో రాళ్లు, పంట వేర్లు, కొయ్యలు మొదలైన వాటిని తీసివేయాలి. మట్టి తడిగా ఉంటే నీడలో ఆరబెట్టాలి

➢ కలిపిన మట్టిని నాలుగు భాగాలుగా విడదీయాలి. ఎదురెదురుగా రెండు భాగాలు ఉంచి మిగతా రెండు భాగాలను తీసి వేయాలి.

➢ ఈ మట్టిని శుభ్రమైన గుడ్డ సంచిలోగాని, పాలిథిన్ సంచిలోగాని నింపాలి. ఈ ప్యాకెట్‌లోపల నమునా వివరాలుగల సమాచార పత్రం ఉంచాలి.

➢ సమాచార పత్రంలో రైతు పూర్తి పేరు, తండ్రి పేరు, చిరునామా, పొలం పేరు, సర్వే నంబర్, ఎంత భూమి, మెట్ట లేదా నీటి పారుదల లేదా ఆరుతడి గత 3 సంవత్సరాలుగా వేసిన పైరుకి వాడిన ఎరువులు, పంట దిగుబడి వివరాలు, సాగు చేసే పంట వివరాలను రాయాలి. సేకరించిన మట్టి నమునాలను వ్యవసాయ అధికారి ద్వారా సమీపంలోని భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి.

రైతులకు అవగాహన పెరగాలి



భూసార పరీక్షపై రైతుల్లో అవగహన పెరగాలి. మట్టిన మూనా పరీక్ష లేకుండా పంట సాగు చేయకూడదు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మట్టి, నీటి పరీక్షలు చేస్తున్నాం. మట్టి పరీక్షకు రూ.100 (ఒక శాంపిల్‌కు), నీటి పరీక్షకు రూ.60 (ఒక శాంపిల్‌కు) తీసుకుంటున్నాం. మట్టి, నీటి శాంపిల్స్ సేకరణలో ఏమైన సందేహాలుంటే 80741 43694 (ప్రోగాం అసిస్టెంట్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్) నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. – డాక్టర్ సుజాతమ్మ, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కేవీకే బనవాసి, ఎమ్మిగనూరు

నారా లోకేశ్ కాదు.. జోకర్ లోకేశ్

- మహిళలను గౌరవించలేని సంస్కారం ఆయనది
- ఎన్నికల కోసం డ్రామాలాడితే ప్రజలు నమ్మరు
- అధికారంలో ఉన్నప్పుడు పత్తికొండను ఎందుకు అభివృద్ధి చేయలేదు?
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: అవగాహనారాహిత్యంతో మాట్లాడుతున్న నారా లోకేశ్‌ను చూసి ప్రజలు జోకర్ లోకేశ్ అని నవ్వుకుంటున్నారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆదివారం పత్తికొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్న లోకేశ్ పెద్ద మూర్ఖుడు అన్నారు. మహిళలను గౌరవించలేని సంస్కారం ఆయనది అన్నారు. చంద్రబాబు కుప్పం నియోజకవర్గం నుంచి 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, 14 ఏళ్లపాటు సీఎంగా పనిచేశారని, అయితే కుప్పంలో ఇంతవరకు ఎందుకు అభివృద్ధి చెందలేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు వచ్చి పత్తికొండకు పరిశ్రమలు తెస్తాం అంటూ లోకేశ్ ప్రగల్బాలు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారని ప్రశ్నించారు. పత్తికొండ నుంచి ఎన్నికైన కేఈ కృష్ణమూర్తి డిప్యూటీ సీఎంగా, రెవెన్యూ మంత్రిగా పనిచేసి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. పత్తికొండకు రెవెన్యూ డివిజన్, పోలీసు సబ్‌డివిజన్ ఏర్పాటుచేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. నియోజకవర్గంలోని చెరువులకు నీటిని మళ్లించే పనులకు సంబంధించి టీడీపీ హయాంలో భూముల సేకరణ మాత్రమే జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే 65 శాతం పనులు జరిగాయన్నారు. త్వరలోనే చెరువులకు నీళ్లు వస్తాయన్నారు. అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, హత్యారాజకీయాలు టీడీపీ నాయకులకు మాత్రమే సాధ్యం అన్నారు. టీడీపీ హయాంలో ఇసుక మాఫియాను అడ్డుకున్నందుకే తన భర్త చెరుకులపాడు నారాయణరెడ్డిని, బీసీ నాయకుడు బోయ సాంబశివుడును దారుణంగా హత్య చేయించారన్నారు. కుట్రదారులు, కబ్జాకోరులను తన పక్కనే పెట్టుకుని నారా లోకేశ్ నీతి వ్యాఖ్యలు వల్లె వేస్తుంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పర్సంటేజీల కోసం రైల్వే కాంట్రాక్టర్‌పై టీడీపీ బీసీ నాయకుడు తుగ్గలి నాగేంద్ర అనుచరులు దాడులు చేసిన చరిత్ర మరిచారా అని ఎమ్మెల్యే నిలదీశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని కేఈ అనుచరులు మోసం చేసిన ఘటనలు గుర్తు రావడం లేదా అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో పత్తికొండ ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి శ్రీరంగడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ టీఎండీ హుసేన్, హోసూరు, కోతిరాళ్ల సర్పంచులు నాగప్ప, అంజినయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

క్లుప్తంగా

మహేశ్వరయ్య పురస్కారానికి 'కలుంకూరి గుట్ట' కథలు ఎంపిక

కర్నూలు కల్చరల్: సాహితీ స్రవంతి మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కారం – 2022కు 'కలుంకూరి గుట్ట' కథలు ఎంపికైనట్లు అవార్డు కమిటీ అధ్యక్షుడు కెంగార మోహన్ ప్రకటించారు. ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో అవార్డు కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల నుంచి 39 సంపుటాలు అవార్డు పరిశీలనకు వచ్చాయన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన కేవీ మేఘనాథరెడ్డి రాసిన కలుంకూరి గుట్ట కథా సంపుటి అత్యుత్తమ కథా సంపుటిగా నిలవడంతో పురస్కారానికి ఎంపిక చేశామన్నారు. సమావేశంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు,అవార్డు కమిటీ కార్యదర్శి అయ్యన్న, నగర గౌరవాధ్యక్షుడు కవితా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనా పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది మార్చి నెలలో కురిసిన అకాల వర్షాలతో జిల్లాలో 370.62 హెక్టార్లలో రబీ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఎన్యూమరేషన్ నిర్వహించింది. ఎన్యూమరేషన్ పూర్తి కావడంతో ఇన్‌పుట్ సబ్సిడీ కోసం జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కర్నూలు మండలంలో మినుము మూడు హెక్టార్లు, ఆముదం 33.69, జొన్న 3.68, మొక్కజొన్న 321.34 ప్రకారం మొత్తం 361.71 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. మంత్రాలయం మండలంలో సజ్జ 3.16 హెక్టార్లు, మొక్కజొన్న 5.75 హెక్టార్ల ప్రకారం మొత్తం 8.91 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.43,94,329 కోట్లు విడుదల చేయాలని కోరారు.

అరుదైన వ్యాధి..అంతులేని వ్యథ!

- జిల్లాలో 63 మంది హిమోఫిలియాతో సతమతం
- గాయమైతే వారికి నిరంతరం రక్తస్రావం
- రూ.10 వేల చొప్పున ప్రత్యేక పెన్షన్ ఇస్తోన్న ప్రభుత్వం
- కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్స కేంద్రం
- నేడు వరల్డ్ హిమోఫిలియా డే



మనిషి శరీరంలో రక్తప్రసరణ వ్యవస్థలో రక్తం గడ్డకట్టేందుకు కొన్ని రసాయనాలు ఉంటాయి. వాటిని కోయాగ్యులేషన్ ఫ్యాక్టర్స్ అంటారు. ఇవి లేకపోతే మనకు ఏదైనా దెబ్బతగిలినప్పుడు ఆగకుండా రక్తస్రావమవుతూ ఉంటుంది. ఈ అరుదైన వ్యాధిని వైద్యపరిభాషలో హిమోఫిలియా అంటారు. నేడు వరల్డ్ హిమోఫిలియా డే సందర్భంగా ప్రత్యేక కథనం.



ఐసీహెచ్‌హెచ్ సెంటర్ ఏర్పాటు చేసిన విభాగం

కర్నూలు(హాస్పిటల్): హిమోఫిలియా ఎక్కువగా వారసత్వంగా వచ్చే జన్యుపరమైన వ్యాధి. రక్తప్రసరణ వ్యవస్థకు చెందిన ఈ జబ్బు ఎక్కువగా మగపిల్లలకు మాత్రమే సంక్రమించే అవకాశం ఉంది. ఈ వ్యాధి జన్యువు ఎక్స్ క్రోమోజోముపై ఉంటుంది. ఇది తల్లివాహకంగా పనిచేస్తుంది. రక్తం గడ్డకట్టేందుకు, రక్తస్రావం ఆపడానికి అవసరమైన ప్రక్రియ శరీర సామర్థ్యాన్ని ఈ వ్యాధి బలహీనపరుస్తుంది. శరీరానికి గాయం తగిలితే వెంటనే సులభంగా రక్తం కారుతుంది. కీళ్లు, మెదడులోపల రక్తస్రావం సైతం ఎక్కువ కాలం జరుగుతుంది. దీనివల్ల వారికి భవిష్యత్‌లో తీవ్ర దుష్పరిణాలు సంభవించే అవకాశం ఉంది.

పెద్దాసుపత్రిలో ప్రత్యేక కేంద్రం

జిల్లాలో హియోపిలియా వ్యాధి గ్రస్తులు 63 మంది ఉన్నారు. వీరికి చికిత్స కోసం ఇంటిగ్రేటెడ్ సెంటర్ ఫర్ హిమోగ్లోబినోపతీస్, హిమోఫిలియా(ఐసీహెచ్‌హెచ్) టెస్టింగ్ అండ్ ట్రీట్‌మెంట్ సెంటర్‌లను రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్టణం, ఈస్ట్ గోదావరి, గుంటూరుతో పాటు కర్నూలుకూ మంజూరు చేసింది. ఈ కేంద్రాన్ని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో ఏర్పాటు చేశారు. 600 నుంచి 700 చ.అ విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో పది పడకలు ఏర్పాటు చేశారు. ఇందులో తలసీమియాతో పాటు సికిల్‌సెల్, హిమోఫిలియా బాధితులకు చికిత్స అందించనున్నారు. ఇందుకోసం టెస్టింగ్ సెంటర్‌లో ఒక పాథాలజిస్టు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను డిప్యూట్ చేశారు. వీరితో పాటు చికిత్స చేసేందుకు సీనియర్ ఫిజీషియన్, చిన్నపిల్లల వైద్యులనూ ఏర్పాటు చేశారు. ఇందుకు అవసరమైన పరికరాలను, మందులు ఏపీఎంఎస్ఐడీసీ సరఫరా చేసింది.

వ్యాధి లక్షణాలు

ఏదైనా దెబ్బతగిలినప్పుడు ఆగకుండా రక్తస్రావం అవుతూ ఉంటుంది. కొన్నిసార్లు నోటిలో, ముక్కు ద్వారా రక్తస్రావం జరగవచ్చు. చిన్న గాటుకే అధిక రక్తస్రావం జరుగుతుంది. కొన్నిసార్లు మూత్రం, మలంలో రక్తం పడుతుంది. ఎలాంటి గాయం లేకుండానే కీళ్లలో రక్తస్రావం జరుగుతుంది. జన్యుపరీక్ష ద్వారా వ్యాధిని ర్ధారణ చేస్తారు. దీనికి జన్యుపరమైన సలహాలు ఇస్తారు.

బాధితులకు ప్రత్యేక పెన్షన్: హిమోఫిలియా వ్యాధి పీడితులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడుతున్నారు. వీరికి అవసరమైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెలా రూ.10వేల ప్రత్యేక పెన్షన్ ఇస్తున్నారు.

బాధితులకు ఉచిత చికిత్స



హిమోఫిలియా బాధితులకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు, చికిత్సలను అందించేందుకు ఆసుపత్రిలో ఐసీహెచ్‌హెచ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాము. చిన్నపిల్లల విభాగంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో జనరల్ ఫిజీషియన్‌తో పాటు చిన్నపిల్లల వైద్యులు కూడా ఉంటారు. బాధితులకు అవసరమైన పరీక్షలు, కౌన్సిలింగ్ నిర్వహించేందుకు వైద్యులు, సిబ్బంది నియమించాము.

–డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్, కర్నూలు

అవసరమైనప్పుడు బ్లడ్ ఫ్యాక్టర్స్ ఎక్కించాలి



హిమోఫిలియా జన్యుపరమైన వ్యాధి. ప్రతి 10 వేల నుంచి 20వేల మందిలో ఒకరికి వస్తుంది. కండరాలు, జాయింట్‌ల దగ్గర దెబ్బలు తగిలినప్పుడు తీవ్ర రక్తస్రావం అవుతుంది. ఇందులో రెండు రకాలున్నాయి. ఒకటి హిమోఫిలియా–ఎ. ఇది ఫ్యాక్టర్ 8 డెఫిసెన్సీ, రెండోది హిమోఫిలియా–బి. ఇది ఫ్యాక్టర్ 9 డెఫిసెన్సీ. రక్తం గడ్డకట్టే విధానాన్ని కోల్పోవడం వల్ల తీవ్ర రక్తస్రావం అవుతంంది. దీనికి జెనటిక్ కౌన్సిలింగ్‌తో పాటు అవసరమైన వారికి కోల్పోయిన బ్లడ్ ఫ్యాక్టర్స్ ఎక్కించాల్సి ఉంటుంది.

– డాక్టర్ అమరనాథరెడ్డి, చిన్నపిల్లల వైద్యులు, కర్నూలు

మట్కా, నాటుసారా స్థావరంపై దాడి

- రూ 2.50 లక్షలు మట్కాసొమ్ము స్వాధీనం
- 30 లీటర్ల నాటుసారా పట్టివేత



మట్కా, నాటుసారా నిందితులను అరెస్ట్ చూపిస్తున్న పోలీసులు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ముదిగేడురోడ్ రైల్వే వంతెన సమీపంలో పెద్ద ఎత్తున జరుగుతున్న మట్కా, నాటుసారా విక్రయాలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఎస్ఐలు వెంకటరెడ్డి, మౌలానీ తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన చాంద్‌బాషా కోవెలకుంట్లకు చెందిన గాజుల వెంకటనారాయణ, తెలుగు పెద్దయ్య అనే వ్యక్తులు ఇటీవల కాలంలో మట్కా, సారా వ్యాపారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐలు తమ సిబ్బందితో దాడి చేయగా చాంద్‌బాషా అక్కడి నుంచి పరారయ్యాడు. మిగిలిన ఇద్దరి వ్యక్తుల నుంచి రూ. 2.50 లక్షల మట్కాసొమ్ము, 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐలు తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

కురుబ, కురుమ సంఘం అధికార ప్రతినిధిగా మోహన్‌ప్రసాద్

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ కురుబ, కరుమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మోహన్‌ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు కురుబ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, కురబ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సూరిబాబు, కురుబ, కురుమ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంటు రామకృష్ణ ఆదివారం ప్రకటించారు. సత్యసాయి జిల్లా బత్తుల పల్లిలోని కోటిసూరి కళాశాలలో జరిగిన యువజన సంఘం ప్రతినిధుల సమావేశంలో మోహన్ ప్రసాద్‌ను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు నియామక పత్రం అందజేశారు. అధికార ప్రతినిధిగా తన బాధ్యతలను పకడ్బందీగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా మోహన్‌ప్రసాద్ తెలిపారు.

ఎల్లెల్సీలో మృతదేహం లభ్యం



మృతి చెందిన బోయ మద్దిలేటిరంగడు(16)

ఎమ్మిగనూరు రూరల్: గుడేకల్ గ్రామ పరిధిలోని ఎల్లెల్సీలో ఆదివారం ఓ మృతదేహం లభ్యమైంది. వివరాలు....పెద్దకడుబూరు మండలం హనుమాపురం గ్రామానికి చెందిన బోయ తిక్కస్వామి, లక్ష్మీల కుమారుడు బోయ మద్దిలేటి రంగడు(16) శనివారం గుడేకల్ గ్రామంలో కూలీ పనులకు వెళ్లాడు. పనులు పూర్తైన తరువాత మలవిసర్జనకు వెళ్లివస్తానని హనుమాపురం గ్రామ కూలీలకు చెప్పి వెళ్లాడు. అయితే, కాలువలో ముఖం శుభ్రం చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయాడు. ఈత రాకపోవటంతో నీటిలో మునిగిపోయాడు. ఎంతసేపటికి తిరిగిరాకపోవడంతో తోటి కూలీలు పరిసర ప్రాంతాలకు వెళ్లి వెతికారు. ఆచూకీ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ఆదివారం ఉదయం వారు గాలిస్తుండగా మృతదేహం కెనాల్‌లో కనిపించడంతో బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ పి.నిరంజన్‌రెడ్డి తెలిపారు.

సాహితీ వైతాళికుడు.. కందుకూరి



జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన



హాజరైన ప్రేక్షకులు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన

కర్నూలు కల్చరల్: సాహితీ వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అన్నారు. టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం కందుకూరి జయంతిని పురస్కరించుకొని తెలుగు నాటక దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ సృజన, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి కందుకూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణానికి, సంఘ సంస్కరణకు కందుకూరి సాహిత్య రచనలు చేశారన్నారు. మొదటి తెలుగు నాటకాన్ని రచించి ప్రదర్శించిన మహనీయుడన్నారు. నాటకంపై ఉన్న గౌరవం, నటులైన మా నాన్న గుమ్మళ్ల బలరామయ్యపై ఉన్న గౌరవంతో వేడుకలకు హాజరయ్యానన్నారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ కళాక్షేత్రం కళాకారులకు మంచి వేదికగా నిలుస్తుందన్నారు. తాము కళాకారులకు అండగా ఉంటామన్నారు. అనంతరం రచయిత పల్లేటి కులశేఖర్‌ను నటి సురభి ప్రభావతి, ఆహార్యం శ్రీనివాసులు, నాట్యాచార్యులు కరీముల్లాకు ఉత్తమ పురస్కారాలు అందజేశారు. డ్యాన్స్ మాస్టర్ కరీముల్లా శిష్య బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ కర్ణార్జునీయం నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ శేషయ్య, ప్రముఖ నాటక రచయిత పల్లేటి కులశేఖర్, సీనియర్ కళాకారులు హెచ్.చంద్రన్న, మనోహర్‌బాబు, సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న , శ్రీనివాసరెడ్డి, క్రిష్టఫర్, తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిపై అన్న కత్తితో దాడి

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటకు చెందిన కురువ మల్లికార్జున కుమారులు రమణ, రోహిత్‌ల మధ్య కుటుంబ కలహాల కారణంగా వివాదం చోటు చేసుకుంది. దీంతో అన్న.. తమ్ముడిపై కత్తితో దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు..తండ్రి మల్లికార్జున చిన్న కుమారుడైన రోహిత్‌ను అల్లరి చిల్లరగా తిరుగుతున్నావ్ అంటూ మందలించాడు. దీంతో రోహిత్ తండ్రిపై దాడి చేయడానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న పెద్ద కుమారుడు రమణ తమ్ముడిని వారించడానికి ప్రయత్నం చేశాడు. దీంతో నువ్వేమైన పని చేస్తున్నావా అంటూ అన్నపై తిరగబడటంతో కోపంలో అక్కడే ఉన్న కత్తిని తీసుకొని తమ్ముడిపై దాడి చేశాడు. గాయపడిన రోహిత్‌ను చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఈ విషయంపై పట్టణ పోలీసులను ఆరా తీయగా తమకు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

తండ్రి కొడుకుల ఘర్షణ

పట్టణంలోని కొత్తపేటకు చెందిన భాస్కర్, అతని కుమారుడు కల్యాణ్ ఘర్షణ పడి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద జరిగింది. తన సోదరికి ఇష్టంలేని వివాహం చేసేందుకు తండ్రి ప్రయత్నిస్తున్నాడని కల్యాణ్ ఆమెను ఇంటి నుంచి తీసుకుపోయి అక్క ఇంట్లో విడిచి పెట్టాడు. ఈ నేపథ్యంలో పాత బస్టాండ్ వద్ద ఇద్దరి మధ్య మాటలు పెరిగి ఒక్కరిపై ఒక్కరు దాడి చేసుకున్నారు. తండ్రి కాలుకు, కుమారుడి చేతికి గాయాలైనట్లు ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. వారు చికిత్స నిమిత్తం వైద్యశాలకు వెళ్లారు.

కత్తి పోటుకు గురైన రోహిత్‌ను కర్నూలుకు తరలిస్తున్న దృశ్యం



ముక్తి మార్గం!

- రంజాన్‌మాసంలో ముగిసిన రెండు దశకాలు
- కొనసాగుతున్న మూడో దశకం 'జహన్నం సే ఫనా మాంగ్‌నేకే రోజే'
- నరకాగ్ని నుంచి విముక్తికి అల్లా కల్పించిన దశకమిది



కర్నూలు నగరంలోని మసీదులో దువా చేస్తున్న ముస్లింలు

కర్నూలు (రాజ్‌విహార్): పవిత్ర రంజాన్ మాసం చివరి అంకం వచ్చేసింది. రెండో దశకం 'మగ్‌ఫిరత్ కా అష్ర' ముగియడంతో గత గురువారం నుంచి మూడు దశకం 'జహన్నం సే ఫనా మాంగ్‌నేకే అష్ర' ప్రారంభమైంది. చేసిన పాపాలకు మరణం తరువాత విధించే నరకాగ్ని శిక్ష నుంచి విముక్తిని కోరుకునేందుకు ఈ అష్ర (దశకం) కేటాయించబడింది. మనిషి తన జీవితంలో తెలిసోతెలియకో కొన్ని తప్పులు చేస్తుంటారు. అయితే, వాటిని సరి దిద్దుకునేందుకు క్షమించమని అల్లాహ్‌ను కోరుకునేందుకు కేటాయించినది తుది అష్ర అని, ఈ పది రోజులు ముక్తి కోసం యత్నించాలని మౌల్వీలు చెబుతున్నారు.

ఎన్నో విశిష్టతలు కలిగిన అష్ర

ఇస్లామిక్ క్యాలెండర్‌లో రంజాన్ మాసం 30 లేదా 29 రోజులు ఉంటుంది. దీనిని మూడు భాగాలుగా విభజించారు. మొదటి 10 రోజులను 'రహమత్‌కా అష్ర' అంటారు. ఇందులో అల్లాహ్ కరుణ, దయ అధికంగా ఉంటుంది. రెండో దశకాన్ని మగ్ ఫిరత్‌కా అష్ర అంటారు. ఈ అష్ర బుధవారంతో ముగిసింది. గురువారం నుంచి ప్రారంభమయ్యే జహన్నంసే ఫనా మాంగ్‌నేకా అష్రలో ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. ఇది రంజాన్ ముగింపు సూచికగా కనిపించే చంద్ర దర్శనం వరకు (21 రోజాల చివరి వరకు) ఉంటుంది. ఈ అష్రలో పాపాలను కడిగేసుకునేందుకు తౌబా, అస్తగ్ ఫర్‌ను పదేపదే చదవాలి. రోజా నమాజ్‌లు చదువుతూ తప్పులను క్షమించమని అల్లాహ్‌ను దువా చేసుకోవాలి.

తాఖ్ రాత్‌లు ఆరంభం

తాఖ్ రాత్‌లు ఆరంభమయ్యాయి. రంజాన్‌లో ఎంతో కీలకమైన లైలతుల్ ఖదర్ (పెద్ద రాత్రి) ఏ రాత్రి ఉందో స్పష్టత లేదు. అయితే, అది ఐదు తాఖ్ రాత్‌ల పేరుతో ఉన్న 21, 23, 25, 27, 29 ఉపవాస దీక్షలు పాటించే ముందు వచ్చే రాత్రుల్లో ఏదో ఒక రాత్రి ఉంటుందని మహమ్మద్ ప్రవక్త (సొల్లెల్లాహు అలైహి వసొల్లెం) బోధించిన హదీసు ద్వారా తెలుస్తోంది. అంటే ఈనెల 12, 14, 16, 18, 20వ తేదీల రాత్రుల్లో తాఖ్ రాత్‌ల జాగారణ చేసి, ఆధ్యాత్మికంగా గడిపితే లైలతుల్ ఖదర్ విశిష్టతలు పొందుతారు.

పూర్వీకులకూ పాప విముక్తి

రంజాన్ రోజాల అనంతరం సాయంత్రం ఇఫ్తార్ వేళ మొర ఆలకించే సమయం. ఆ సమయంలో కోరుకున్నవి అల్లాహ్ ప్రసాదిస్తారని ఖురాన్ బోధిస్తోంది. ఇఫ్తార్‌కు ముందు చేసే దువా కూడా తప్పక ఆమోదింపబడుతుంది. నరకం ఖరారైన పాపుల్లో (చనిపోయిన వ్యక్తులు) లక్ష మందిని ప్రతి రోజు ఇఫ్తార్ వేళలో అల్లాహ్ విముక్తి కల్పిస్తారు. మొదటి చివరి రోజా ఇఫ్తార్ సమయంలో 30 లేదా 29 లక్షల మందిని విముక్తి కల్పిస్తారు.ఈ విశిష్టతను దృష్టిలో పెట్టుకుని ఇఫ్తార్ వేళల్లో మన పూర్వీకుల పాప విముక్తి కోసం దువా చేస్తే ఫలిస్తుందని మత పెద్దలు చెబుతారు.

తౌబాతో విముక్తి

ఆరు వర్గాలకు చెందిన మనుషుల పాపాలు విముక్తి కావని మౌల్వీలు అంటారు. ఇందులో బహు దైవారాధన చేస్తూ అల్లాహ్‌తో సమానంగా (షిర్క్) కొలిచేవారు, మద్యం తాగే వాళ్లు, తల్లిదండ్రులపై ప్రేమా, కరుణ చూపని వాళ్లు, బంధుత్వాలను తెంచేవారు, మనసులోఈర్ష్యా ద్వేషాలు కలిగిన వాళ్లు, విచ్చలవిడిగా అక్రమ శృంగారాల్లో పాల్గొనే వ్యక్తుల పాపాలు. అయితే, స్వచ్ఛమైన మనసుతో మరోసారి అలాంటి తప్పులు చేయబోమని (తౌబా) వేడుకుంటే అల్లా వాటి నుంచి కూడా విముక్తి కల్పిస్తారని పవిత్ర గ్రంధ్రం ఖురాన్ బోధిస్తోంది.

స్వచ్ఛమైన మనసుతో అల్లాను ప్రార్థించాలి



సత్ప్రవర్తన, మంచి క్రమశిక్షణ నేర్పే రంజాన్‌లో ఆధ్యాత్మికంగా గడపాలి. మొదటి అష్రలో రహమత్, రెండో అష్రలో మగ్ఫిరత్, మూడవ అష్రలో చేసిన పాపాలు, నరకాగ్ని నుంచి విముక్తి కోసం నమాజ్, దువా చేసి అల్లాహ్‌తో వేడుకోవాలి. –డాక్టర్ సయ్యద్ ఆరీఫ్ పాషా ఖాద్రీ, కర్నూలు